సాక్షి జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం | 28 | జనవరి | 2025



రిజర్వేషన్ల హామీ ఏమైంది..?
బీసీలకు 'స్థానిక' ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి ఏడాదైనా స్పష్టత లేదని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. - 8లో▸



కూలీ పనికి వెళ్లివస్తూ..
కూలీ పనికి వెళ్లివస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో 13 మంది గాయపడ్డారు. అందులో ఒకరు మృతి చెందారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$31.1^0/18.2^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

కాళేశ్వర దేవస్థానం ఈఓగా మహేష్ బాధ్యతలు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానం గ్రేడ్-1 ఈఓగా శనిగల మహేష్ బాధ్యతలు తీసుకున్నారు. సోమవారం ఆయన కాళేశ్వరం దేవస్థానంలోని ఈఓ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఈఓ ఎడవల్లి మారుతి కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లోని గట్టుదుద్దనపల్లి శ్రీఆంజనేయస్వామి ఆలయానికి బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. ఈఓ మారుతి ఆదివారం రిలీవ్ అయి వెళ్లిపోయారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం ఈఓ మహేష్ వచ్చే నెల ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో దేవస్థానంలో కుంభాభిషేకం నిర్వహిస్తున్న నేపథ్యంలో వేదపండితులకు ఆహ్వానం అందజేయడానికి ఆసిఫాబాద్ జిల్లా అచ్చలాపురం వెళ్లారు. పూజ విధానాలు, సామగ్రి, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఉపప్రధాన అర్చకులు ఫణీంద్రశర్మ వెళ్లారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేకాధికారి



భూపాలపల్లి అర్బన్: మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ఎల్.విజయలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రెండు రోజుల క్రితం మున్సిపల్ పాలకవర్గ గడువు ముగిసిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులను కేటాయించింది. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించగా కమిషనర్ రాజేశ్వర్, అధికారులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీనివాస్‌ను సన్మానించిన సీఎండీ



భూపాలపల్లి అర్బన్: కోలిండియా పోటీల్లో ప్రతిభ కనబర్చిన అడిచర్ల శ్రీనివాస్‌ను సింగరేణి సీఎండీ బలరాంనాయక్ సన్మానించారు. కోలిండియా కల్చరల్ పోటీల్లో కూచిపూడి నృత్యంలో భూపాలపల్లి పట్టణానికి చెందిన అడిచర్ల శ్రీనివాస్ గోల్‌మెడల్ సాధించారు. ఈ నెల 26వ తేదీన కొత్తగూడెంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో సత్కరించి అభినందించారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక దందా

- ఏఎల్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దబ్బకట్ల సుమన్

మంగపేట: మండలంలోని రమణక్కపేట గ్రామపంచాయతీ పరిధిలోని కొమరంభీం గిరిజన ఇసుక క్వారీ నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుక దందా కొనసాగుతోందని ఆదివాసీ లిబరేషన్ ఫోర్స్ (ఏఎల్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు దబ్బకట్ల సుమన్ సోమవారం ఆరోపించారు. కొమురంభీం ఇసుక క్వారీ పక్కనే వాడగూడెం పంచాయతీ పరిధిలోని రైతులకు చెందిన పట్టాభూముల పేరుతో ఇసుక క్వారీ నిర్వహణ సాగుతుందన్నారు. దీన్ని ఆసరా చేసుకున్న రైజింగ్ కాంట్రాక్టర్లు కొందరు రాజకీయ పెద్దల అండతో రమణక్కపేట కొమురంభీం ఇసుక క్వారీ పేరుతో ఆన్‌లైన్ పెట్టించుకుని పట్టా క్వారీలోని ఇసుకను అక్రమంగా లారీల్లో తరలిస్తుండగా పట్టుకున్నామని ఆయన ఆరోపించారు. ఇసుక క్వారీలపై సంబంధిత టీజీ ఎండీసీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇసుక దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. వాస్తవానికి కొమురంభీం ఇసుక క్వారీ సొసైటీకి గోదావరి నుంచి స్టాక్ పాయింట్‌కు ఇసుకను తరలించేందుకు ఈసీ పర్మిషన్ లేనప్పటికీ రాత్రి సమయాల్లో భారీ ప్రొక్లయిన్ యంత్రాలతో తవ్వకాలు జరుపుతూ టిప్పర్లతో స్టాక్ పాయింట్‌కు చేరవేస్తున్నారన్నారు. పట్టా భూములని చెప్పి గోదావరిలో నిబంధనలు పాటించకుండా భారీ గోతులు తీసి ఇసుక తవ్వకాలు జరుపుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టా భూముల పేరుతో అక్రమంగా అనుమతులు పొంది, గోదావరిలో ఇసుక తవ్వకాలు జరుపుతున్న క్వారీని నిలుపుదల చేసి అనుమతులు ఇచ్చిన రెవెన్యూ, వ్యవసాయశాఖ, మైనింగ్, టీఎస్ ఎండీసీ, భూగర్భ జల శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని సుమన్ డిమాండ్ చేశారు.

ఎంసీహెచ్ కిట్లు ఏవి..





గతేడాది నుంచి నిలిచిన సరఫరా

- 2022 ఆగస్టు నుంచి అందని ప్రోత్సాహకం
- న్యూట్రీషన్ కిట్లదీ అదే దారి..
- గర్భిణులు, బాలింతలకు తప్పని ఎదురుచూపు

భూపాలపల్లి అర్బన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకు చేపట్టిన ఎంసీహెచ్ కిట్ల పంపిణీ నిలిచిపోయింది. దీంతో పాటు గర్భిణులు, బాలింతలకు ప్రోత్సాహకాలు కూడా బంద్ అయ్యాయి. గర్భిణులకు అందజేసే న్యూట్రీషన్ కిట్ల పంపిణీ కూడా ఆగింది. దీంతో గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటి గురించి వైద్యులు, అధికారులను అడిగితే సమాధానం దాటవేస్తున్నారు. ప్రభుత్వం ఎప్పుడు కిట్లను సరఫరా చేస్తుందో, ప్రోత్సాహక నిధులు ఎప్పుడు విడుదల చేస్తుందోనని గర్భిణులు, బాలింతలు ఎదురుచూస్తున్నారు.



అందని పౌష్టికాహారం..

గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా రక్తహీనత నుంచి రక్షించి మాతా శిశు మరణాలను తగ్గించేలా గత ప్రభుత్వం గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేసింది. న్యూట్రీషన్ కిట్‌లో నెయ్యి, హార్లిక్స్, ఖర్జూరాలు, పల్లీ పట్టి, తదితర వస్తువులను బుట్టలో పెట్టి అందజేసేవారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, జీజీహెచ్ పేర్లు నమోదు చేసుకున్న గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేసేవారు. ప్రస్తుతం ఆ కిట్ల పంపిణీ కూడా నిలిచిపోయి ఏడాది అవుతోంది.

మూడేళ్లుగా నిలిచిన ప్రోత్సాహకం..

గర్భం దాల్చిన మహిళ మూడు నెలల నుంచి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేరు నమోదు చేసుకుని నెల నెలా పరీక్షలు నిర్వహించుకోవడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించిన వారికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అమలు చేసింది. ఆడపిల్ల పుడితే రూ.13వేలు, మగబిడ్డ పుడితే రూ.12వేలు తల్లుల ఖాతాల్లో జమ చేసింది. ఈ మొత్తాన్ని గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో రెండు చెకప్‌లు పూర్తయిన తర్వాత రూ.2వేలు, ప్రసవించిన తర్వాత రూ.3వేలు, బిడ్డకు వ్యాక్సినేషన్ తర్వాత రూ.2వేలు, అన్ని వ్యాక్సినేషన్లు పూర్తయిన తర్వాత మిగతా డబ్బులను తల్లుల ఖాతాల్లో వేసేవారు. ప్రస్తుతం ఈ ప్రోత్సాహకం కూడా పూర్తిగా నిలిచిపోయింది. 2022 ఆగస్టు నుంచి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 12,500 మంది తల్లుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. ఈ డబ్బుల కోసం తల్లులు ఎదురు చూస్తున్నారు

ప్రభుత్వం నుంచి సరఫరా లేదు..



రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎంసీహెచ్ కిట్లు, న్యూట్రీషన్ కిట్లు సరఫరా కావాల్సి ఉంది. అవి వచ్చిన వెంటనే అందజేస్తాం. ప్రోత్సాహకాల నిధులు కూడా ప్రభుత్వం నుంచి విడుదల కాలేదు. విడుదలయ్యాక వెంటనే తల్లుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తాం. ఈ వివరాలు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి పంపిస్తున్నాం.

- డాక్టర్ శ్రీదేవి, ఎంసీహెచ్ జిల్లా ప్రోగ్రాం అధికారిణి

20 రకాల వస్తువులు

బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేసీఆర్ కిట్ పథకాన్ని అమలు చేసింది. కిట్‌లో 20 రకాల వస్తువులను తల్లికి బిడ్డకు అవసరమైన వాటిని ఉంచి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యే సమయంలోనే అందజేసి.. ప్రభుత్వ వాహనంలో వారిని ఇళ్ల వద్దకు చేరవేసేవారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కేసీఆర్ కిట్ పేరును ఎంసీహెచ్ కిట్టుగా మార్చింది. పేరు మార్చిన తర్వాత అప్పటికే ఉన్న కేసీఆర్ కిట్లను ఎంసీహెచ్ కిట్లుగా రాసి స్టిక్కర్లను అతికించి బాలింతలకు అందజేశారు. కిట్లు సరఫరా కాకపోవడంతో 2023 అక్టోబర్ నుంచి పంపిణీ పూర్తిగా నిలిచిపోయింది. జిల్లాకు గత ప్రభుత్వ హయాంలో సరఫరా చేసిన కిట్లు గత అక్టోబర్ మాసంతో పూర్తయ్యాయి. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 600మంది బాలింతలకు ఎంసీహెచ్ కిట్లు అందజేయాల్సి ఉంది. ఆస్పత్రుల్లో కిట్ల గురించి అడిగే బాలింతలకు సమాధానం చెప్పలేక వైద్యులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వెంటిలేటర్లు



వెంటిలేటర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో అందించిన కొత్త వెంటిలేటర్లను సోమవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటిలేటర్ల ప్రారంభం ద్వారా అత్యవసర వైద్యసేవలు మరింతగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ద్వారా రూ.32లక్షల విలువగల వెంటిలేటర్లు ఇవ్వడం పట్ల అభినందించారు. మన జిల్లాతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వైద్య సేవలకు ప్రజలు పెద్ద ఎత్తున వస్తుంటారని తెలిపారు. అత్యవసర వైద్యసేవలకు ఎంఆర్‌ఐ పరికరం ఇవ్వాలని కోరారు. రెండు నెలల క్రితం వెంటిలేటర్లు ఇవ్వాలని ప్రతిపాదనలు ఇవ్వగా.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (సీఎస్ఆర్) నిధులతో వెంటిలేటర్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంత ప్రజలకు వైద్యసేవలలో భాగస్వాములు అయినందుకు అభినందించారు. ఏదేని అత్యవసర సేవలకు వచ్చిన వ్యాధిగ్రస్తులు, ప్రమాదాల్లో గాయపడిన వ్యక్తులకు అత్యవసర వైద్యసేవలు అందించడానికి ఈ పరికరాలు చాలా ఉపయోగకరమని తెలిపారు. ఎంఆర్‌ఐ పరికరం చాలా అవసరం ఉందని, మంజూరుకు ప్రతిపాదనలు ఇస్తామని బోర్డు నుంచి అనుమతి ఇవ్వాలని సూచించారు. అంతకుముందు ఐసీయూ యూనిట్‌ను పరిశీలించి, చికిత్స పొందుతున్న వ్యాధిగ్రస్తులకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ రీజినల్ హెడ్ వెంకటేశ చల్లవార్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్‌కుమార్, హెచ్‌డీఎఫ్‌సీ జోనల్ హెడ్ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లు నిబంధనలు పాటించాలి



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

భూపాలపల్లి అర్బన్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో స్కానింగ్ సెంటర్లు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ ఆదేశించారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పీసీపీఎన్డీటీ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించి డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. నిబంధనలను విస్మరించిన స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అబార్షన్లు జరిగే ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్‌లపై నిఘా పెట్టాలన్నారు. ప్రతీ నెల విధిగా ఎంటీపీ వివరాలను తెలియజేయాలని సూచించారు ఈ సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, గైనకాలజిస్టులు, పిడియాట్రిషన్, సోషల్ వర్కర్లు, డెమో శ్రీదేవి పాల్గొన్నారు.

కుష్ఠుపై అవగాహన కలిగి ఉండాలి

కుష్ఠు వ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ సూచించారు. ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు పక్షం రోజులు కుష్ఠు వ్యాధి అవగాహన ఉద్యమం నిర్వహించాలన్నారు. సోమవారం డీఎంహెచ్‌ఓ వైద్యాధికారులు, నోడల్ పర్సన్స్, శిక్షణా శిబిరం నిర్వహించారు. 2030 వరకు జిల్లాను కుష్ఠు వ్యాధి రహిత జిల్లాగా చేయడంలో అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమాదేవి, మల్లయ్య పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

భూపాలపల్లి అర్బన్: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను ఈ నెల 29వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 29న నైతిక, మానవ విలువలు, 30న పర్యావరణ విద్య, 31న ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్, ఫిబ్రవరి 1వ తేదీన ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు, ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 22వ తేది వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

ఎస్పీ కిరణ్ ఖరే



మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి: ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన 14మంది బాధితులతో మాట్లాడి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. చట్టవ్యతిరేకమైన చర్యలు చేస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలని జిల్లాలోని పోలీసు అధికారులకు సూచించారు. బాధితుల ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఆదేశించారు.

'కాళేశ్వరం' పాలకమండలికి 90 దరఖాస్తులు

త్వరలో ట్రస్టుబోర్డు ఏర్పాటు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానం పాలక మండలి(ట్రస్టుబోర్డు) కోసం ఆశావహులు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 90మంది వరకు దరఖాస్తులు చేసుకున్నట్లు ఆలయవర్గాల ద్వారా తెలిసింది. ఈనెల 5నుంచి 26వరకు పాలకమండలి డైరెక్టర్ల కోసం దేవాదాయశాఖ దరఖాస్తులు స్వీకరించారు. అసిస్టెంట్ కమిషనర్, ఆర్జేసీ, కమిషనర్ కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేశారు. ఏడాది పాటు పదవి కాలంలో మొత్తం డైరెక్టర్లు, ఒక ఎక్స్‌అఫీషియో మెంబర్ అర్చకుడితో 15మంది నుంచి ఒక్కరిని చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు. ఫిబ్రవరి 7, 8, 9తేదీల్లో కుంభాభిషేకం నిర్వహిస్తున్నారు. పూజల నిర్వహణను శృంగేరి పీఠం వేదపండితులు నిర్వహించనున్నారు. అంతకు ముందే పాలకమండలి నియామకం జరుగాలని ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసింది. చైర్మన్ పదవిని నియోజకవర్గం కాకుండా ఇతర జిల్లాల వారిని నియమించనున్నట్లు ప్రచారం జరుగుతుంది. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విదేశాల్లో ఉన్న నేపథ్యంలో ఆయన ఆశీస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఆగస్టులో ట్రస్టుబోర్డుకు నోటిఫికేషన్ వేసి అనివార్య కారణాలతో మళ్లీ రీనోటిఫికేషన్ వేసిన విషయం తెలిసిందే.

స్వయం ఉపాధి దిశగా ముందుకెళ్లాలి

డీఆర్‌డీఓ నరేశ్



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నరేశ్

కాటారం: ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని గ్రామాల్లో స్వయం ఉపాధి పొందే దిశగా ప్రతీ ఒక్కరు ముందుకెళ్లాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నరేశ్ సూచించారు. కాటారం మండలకేంద్రంలోని రైతువేదికలో సోమవారం ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో ఉన్నతి కార్యక్రమం నిర్వహించారు. మూడేళ్లలో ఉపాధిహామీ పథకంలో వంద రోజులు పూర్తి చేసుకున్న 18నుంచి 45ఏళ్ల వరకు గల కూలీలకు ఉన్నతి కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పాడి పరిశ్రమ, సేంద్రియ వ్యవసాయం, చేపల పెంపకం, కంపోస్టు షెడ్ మొదలైన వాటిపై శిక్షణ అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ మాట్లాడుతూ ప్రజలు ఉపాధిహామీ పథకం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ముందుకు వెళ్లవచ్చన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రీషియన్, ప్లంబర్, టీవీ మెకానిక్, సెల్‌ఫోన్ రిపేరింగ్, డ్రైవింగ్, టైలరింగ్‌పై హనుమకొండలో ఉచిత శిక్షణ అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని డీఆర్‌డీఓ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ మంజుల, డీపీఎం వినేష్, ఏపీఓ వెంకన్న, మహాముత్తారం, మహదేవపూర్, మల్హర్, పలిమెల మండలాల ఉపాధిహామీ ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఐకేపీ సీసీలు, వీఓఏలు, కూలీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ యంత్రాంగ సేవలు అభినందనీయం

- ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలి
- కలెక్టర్ రాహుల్ శర్మ



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నాలుగు పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ విజయవంతంగా అమలు చేయడంలో భాగస్వాములైన గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న ప్రభుత్వ యంత్రాంగం సేవలు అభినందనీయమని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం చేపట్టిన విచారణ, గ్రామసభల నిర్వహణలో ప్రజల సహకారం హర్షణీయమని అన్నారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన పేదలకు అందించేలా పని చేయాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, ఆర్డీఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

ప్రజావాణికి వచ్చిన సమస్యలకు ప్రాధాన్యం ఇచ్చి పరిష్కార మార్గం చూపాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి 89మంది వచ్చి తమ దరఖాస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, ఆర్డీఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ..

జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ శర్మ టీజీఓ, జిల్లా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

భూపాలపల్లి రూరల్: రానున్న వేసవిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా సర్కిల్ నోడల్ అధికారి బికంసింగ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రానున్న వేసవిలో నిరాటంకంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించడానికి నోడల్ స్థాయి అధికారులు రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయాలని ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారని తెలిపారు.

పదవితో సంబంధం లేకుండా సేవలందించాలి



మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి అర్బన్: పదవి ఉన్నా లేకున్నా ప్రజలకు సేవలందించాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. మున్సిపల్ వార్డు కౌన్సిలర్ల పదవీ కాలం ముగియడంతో బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సోమవారం వారిని పార్టీ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. పట్టణ ప్రజల ఓట్లతో కౌన్సిలర్లుగా గెలిచి ఐదేళ్ల పాటు ప్రజలకు సేవలందించారన్నారు. గత ప్రభుత్వ హయాంలో సాధ్యమైనంత మేరకు నిధులు తీసుకొచ్చి వార్డులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పదవులు అనేవి శాశ్వతం కాదని పదవులు ఉన్నా లేకున్నా ప్రజలకు సేవ చేయడంలో ప్రతీ ఒక్కరు ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు జనార్దన్, మాజీ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్దు, మాజీ వైస్ చైర్మన్లు హరీశ్‌రెడ్డి, హరిబాబు, పలువురు మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

- ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా
- గిరిజన దర్బార్‌లో వినతుల స్వీకరణ



గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న పీఓ

ఏటూరునాగారం : సమస్యల పరిష్కారంపై ఐటీడీఏ పరిధిలోని సెక్టార్ అధికారులు దృష్టి పెట్టాలని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా అన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి పీఓ వినతులు స్వీకరించారు.

- హార్టికల్చర్‌లో పనిచేసే సిబ్బంది ఎస్ఆర్ ఈజీఎస్‌లోకి బదిలీ చేయాలని కోరారు.
- వాజేడు మండలంలోని వీరాపురం గ్రామానికి చెందిన శ్రీమణి తన భర్త మృతి చెందాడని, అతడి ఉద్యోగం కారుణ్య నియామకం కింద కల్పించాలని పీఓను వేడుకుంది.
- తాడ్వాయి మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో క్రాఫ్ట్ టీచర్‌గా పని చేస్తున్న వసుధబాయ్ జాకారం పీఎంహెచ్ హెచ్‌డబ్ల్యూఓగా ఎఫ్ఏసీ ఇప్పించాలని విన్నవించారు.
- మంగపేట మండలం మామిడిగూడేనికి చెందిన తాటి విజయ్‌బాబు గూడెంలోని గిరిజన పాఠశాలకు ప్రహరీకి మంజూరు చేయాలని కోరారు.
- మంగపేట మండలం మల్లూరుకు చెందిన నల్లబోయిన లక్ష్మణ్‌రావు ఇతరులు మామిడిగూడెంలో మూడు సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు.
- 2024 మేడారం జాతరలో నవీన్, శ్రీధర్ ట్రైబల్ మ్యూజియం పెయింటింగ్ వర్క్ బిల్లు రూ.7.9 లక్షలు ఇప్పించాలని పీఓకు మొరపెట్టుకున్నారు.
- కన్నాయిగూడెం మండలం గంగుగూడెం గ్రామానికి సమ్మక్క రైతు భరోసా పథకాన్ని ఇప్పించాలని కోరారు. ఇదే మండలం రాజన్నపేటకు చెందిన సత్యం ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదారు పాస్‌పుస్తకం ఇప్పించాలని వేడుకున్నాడు.
- కన్నాయిగూడెం మండలంలోని ఐలాపురంలో ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు జరిగే సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తులకు సేవలు అందించే వలంటీర్లకు 150 టీ షర్టులు ఇప్పించాలని పీఓను కోరారు.
- ఏటూరునాగారం మండలంలోని దొడ్ల కొత్తూరు గ్రామంలో సేల్స్ డిపో భవనం రిపేరు చేయించాలని దబ్బగట్ల పాపారావుతో పాటు గ్రామస్తులు పీఓకు వినతి పత్రాన్ని సమర్పించారు.

20 వినతులు పీఓకు అందించగా వాటిని పరిశీలించి ఆయా సెక్టార్ అధికారుల ద్వారా పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో డీడీ పోచం, ఏఈ ప్రభాకర్, ఐటీఐ ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


సురేశ్(ఫైల్)

భూపాలపల్లి అర్బన్ : అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని కాశీంపల్లి శివారు బాలాజీనగర్ కాలనీలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. మృతుడి తల్లి కందుల సుగుణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సుగుణ కొడుకు కందుల సురేశ్ (37) కాశీంపల్లిలో ఆదివారం రాత్రి నిర్వహించిన కబడ్డీ పోటీలు చూడడానికి వెళ్లి రాత్రి 9 గంటలకు ఇంటికి చేరుకుని ఇంటి ముందు పడుకున్నాడు. తెల్లవారుజామున 5 గంటలకు చూసేసరికి మృతి చెందినట్లు తెలిపారు. ఎవరో రాత్రి సమయంలో హత్య చేసి ఎవరికి అనుమానం రాకుండా మంచంమీద పడుకోబెట్టి వెళ్లారని విలపిస్తూ తెలిపింది. పథకం ప్రకారమే ఇద్దరు వ్యక్తులు కలిసి తన కొడుకును హత్య చేసి ఉంటారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. మృతుడి నడుం భాగంలో గాయాలు కనిపించడంతో పక్కాగా ఇద్దరు కలిసి హత్య చేసి ఉంటారని తల్లి అనుమానాన్ని వ్యక్తం చేసింది. మృతుడు లారీడ్రైవర్ కాగా అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేశ్ కుమార్ తెలిపారు.

పట్టపగలే ఇంట్లో చోరీ



కేసముద్రం: పట్టపగలే ఓ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మండలంలోని అన్నారంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం..గ్రామానికి చెందిన యాకూబ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఎప్పటిలాగే ఇంటికి తాళం వేసి కూలీ పనికి వెళ్లారు. ఈ క్రమంలో మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు ఆ ఇంటితాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంట్లోకి ఉన్న అర తులం బంగారు, వెండి ఆభరణాలు, రూ.6వేల నగదు అపహరించుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చాక తాళం పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ విషయంపై ఎస్సై మురళీధర్‌రాజును వివరణ కోరగా చోరీ ఘటన విషయం తమ దృష్టికి రాలేదన్నారు. దీనిపై విచారణ జరపనున్నట్లు ఆయన తెలిపారు.

కూలీ పనికి వెళ్లి వస్తూ..

రోడ్డు ప్రమాదానికి గురై

గూడూరు–అంబాల మధ్య ఆర్టీసీ బస్సు, టాటా ట్రాలీ ఢీ..

- 13 మందికి తీవ్ర గాయాలు
- ఇందులో చికిత్స పొందుతూ ఒకరు మృతి
- డ్రైవర్ పరిస్థితి విషమం

కమలాపూర్/హసన్‌పర్తి: ఆ బస్తీలో సుమారు 40 ఇళ్లు ఉన్నాయి. వీరందరూ నిరుపేదలు. బండకొట్టడం వీరి ప్రధాన వృత్తి. ఇక్కడ పురుషులతోపాటు మహిళలు కూడా కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటారు. ప్రస్తుతం స్థానికంగా ఉపాధి లేకపోవడంతో చుట్టు పక్కల గ్రామాలకు వెళ్లి పనులు చేస్తున్నారు. రోజూ మాదిరిగానే సోమవారం కూడా మరో ప్రాంతానికి వెళ్లారు. పనులు ముగిసిన అనంతరం టాటా ట్రాలీలో ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో ఆర్టీసీ బస్సు, ట్రాలీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఓ మహిళా కూలీ మృతి చెందింది. ట్రాలీ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన సోమవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని గూడూరు–అంబాల గ్రామాల మధ్యలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం మునిపల్లికి చెందిన సుమారు 24 మంది కూలీలు కమలాపూర్ మండలం వంగపల్లికి వ్యవసాయ పనికి వచ్చారు. పని ముగించుకుని మధ్యాహ్నం టాటా ట్రాలీలో మునిపల్లి వెళ్తున్నారు. ఈ క్రమంలో ట్రాలీ గూడూరు–అంబాల గ్రామాల మధ్యలో ఓ ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాలీలో ప్రయాణిస్తున్న 13 మంది కూలీలు తీవ్రంగా, మిగతా వారు స్వల్పంగా గాయపడ్డారు.



బస్సును ఢీకొని బోల్తా పడిన ట్రాలీ, ఘటనాస్థలిలో క్షతగాత్రులు


హుస్సేన్‌బీ (ఫైల్)

సమాచారం అందుకున్న కమలాపూర్ సీఐ హరికృష్ణ సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులందరినీ 108 వాహనాల ద్వారా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మహిళా కూలీ హుస్సేన్ బీ (45) మృతి చెందగా, ట్రాలీ డ్రైవర్ అబ్దుల్లా పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. తీవ్రంగా గాయపడిన వారిలో సమీనాబీ, యాకూబ్‌పాషా, స్వల్పంగా గాయపడిన వారిలో కరీమా, ముంతాజ్ బేగం, యాకూబ్‌బీ, ఆశ, రంజాన్, గౌసియా, హుస్సేన్ బీ, కరీంబీ ఉన్నారు. కాగా, సమాచారం అందుకున్న కాజీపేట ఏసీపీ తిరుమల్ ఘటనా స్థలిని పరిశీలించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనపై ఆర్టీసీ బస్సు డ్రైవర్ బొట్ల మహేందర్ ఫిర్యాదు మేరకు ట్రాలీ డ్రైవర్ అబ్దుల్లాపై కేసు నమోదు చేసినట్లు సీఐ హరికృష్ణ తెలిపారు.

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే



కాగా, రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు ఎంజీఎంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. మృతురాలి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎ.శ్రీనివాస్, స్వరూప ఉన్నారు.

లారీని ఢీకొట్టి ఆటో బోల్తా

- డ్రైవర్‌కు గాయాలు
- ఘటన ప్రదేశంలోనే మరో ఘటన

ఖిలా వరంగల్ : వరంగల్–ఖమ్మం హైవే మామునూరు టీజీఎస్పీ పెట్రోల్‌బంక్ స్పీడ్ బ్రేకర్ వద్ద లారీ ప్రమాదంలో నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఆదివారం అర్ధరాత్రి అదే ప్రదేశంలో మరో రోడ్డు ప్రమాదం సంభవించింది. వరంగల్ నుంచి వర్ధన్నపేట వైపునకు వెళ్తున్న ఆటో ఆకస్మాత్తుగా అదుపు తప్పి లారీని ఢీకొట్టి ఎదురుగా వచ్చే కారును ఢీకొని రోడ్డుపై అడ్డంగా బోల్తా కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా ఓ ప్రయాణికుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన నాగరాజు ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి వరంగల్ నుంచి వర్ధన్నపేట వైపునకు ప్రయాణికుడిని ఆటోలో ఎక్కించుకొని బయలుదేరాడు.


హైవేపై బోల్తా పడిన ఆటో

ఈ క్రమంలో నలుగురు మృతిచెందిన ఘటనాస్థలికి రాగానే ఒక్కసారిగా ఆటో అదుపుతప్పి లారీ, కారును ఢీకొడుతూ బోల్తా పడింది. గాయపడిన డ్రైవర్‌తో పాటు ప్రయాణికుడిని స్థానికులు 108లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని రోడ్డుపై అడ్డుగా బోల్తా పడిన ఆటోను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

బైక్‌ను ఢీకొన్న లారీ..

- వ్యక్తి మృతి
- కోతులనడుమ బ్రిడ్జిపై ఘటన


రాజేశ్వర్‌రావు (ఫైల్)

ఎల్కతుర్తి : ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం ఎల్కతుర్తి మండలం కోతులనడుమ బ్రిడ్జిపై జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన బచ్చు రాజేశ్వర్‌రావు(52) ద్విచక్రవాహనంపై కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ వెళ్లాడు. తిరిగి స్వగ్రామం వస్తున్న క్రమంలో మార్గమధ్యలోని కోతులనడుమ బ్రిడ్జిపై ఎల్కతుర్తి నుంచి హుజూరాబాద్ వైపునకు వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో రాజేశ్వర్‌రావుకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

నెరవేరనున్న 40 ఏళ్ల కల..!

- కాజీపేట బస్టాండ్ నిర్మాణానికి అడుగులు
- నేడు కలెక్టర్, ఆర్డీఓ, రైల్వే అధికారుల బృందం జాయింట్ ఇన్‌స్పెక్షన్ విజిట్

కాజీపేట రూరల్ : పట్టణ ప్రజల చిరకాల కోరిక కాజీపేట బస్టాండ్ కల త్వరలో నెరవేరబోతుంది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కృషి, పట్టుదలతో 40 ఏళ్ల బస్టాండ్ సమస్య పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. కాజీపేట బస్టాండ్, కాజీపేట రైల్వే డివిజన్, బోడగుట్ట ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, కాజీపేట స్టేషన్ సమీపాన రోడ్డు అండర్‌బ్రిడ్జి, ఇతర దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉదయ్‌నాథ్ కోట్లను వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. దీనిపై రైల్వే జీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. బస్టాండ్ కోసం ఎకరం భూమిని లీజ్ లేదా, రైల్వే భూమి ఇస్తే ప్రభుత్వ భూమి ఇవ్వడం, లేదంటే ప్రభుత్వ


రైల్వే జీఎం ఏకే జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

ధర ప్రకారం భూమి ఇవ్వాలని జీఎంను కోరామన్నారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా అధికారులు, రైల్వే అధికారుల బృందం కాజీపేట జంక్షన్‌లో రైల్వే సంఘ్ కార్యాలయం సమీపం నుంచి బ్రిడ్జి వైపు రైల్వే క్వార్టర్స్ స్థలాన్ని జాయింట్ ఇన్స్‌పెక్షన్ విజిట్ చేయనున్నట్లు తెలిపారు. ఫాతిమా బ్రిడ్జి నిర్మాణం ఏప్రిల్‌లో పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. కాజీపేట బస్టాండ్ ల్యాండ్ ఫైనల్ కావడంతో పనులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఫాతిమా బ్రిడ్జి ప్రారంభం, కాజీపేట బస్టాండ్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జరిపిస్తామన్నారు. అలాగే, కాజీపేట చిరకాల వాంఛ కాజీపేట డిగ్రీ కాలేజీ, కాజీపేట ప్రభుత్వ ఆసుపత్రి మంజూరును ముఖ్యమంత్రితో అనౌన్స్‌మెంట్ చేయించాలన్నదే తన కల అని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి తెలిపారు.

42 శాతం రిజర్వేషన్ల హామీ ఏమైంది


హలో ముదిరాజ్..చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

హన్మకొండ: బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి ఏడాదైనా హామీపై ఇప్పటికీ స్పష్టత లేదని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందుగా బీసీ కమిషన్ వేశారని దీనిపై కోర్టుకు వెళ్లడంతో కోర్టు ఆదేశానుసారం, బీసీల డిమాండ్‌తో డెడికేటెడ్ కమిషన్ వేశారన్నారు. అయినా ఇప్పటి వరకు రిజర్వేషన్లపై స్పష్టత లేదని విమర్శించారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడానికి ప్రతిపక్షంలో ఉన్న పార్టీ, అధికారంలో ఉన్న పార్టీయే కారణమన్నారు. బీసీలకు రాజకీయ పార్టీలు జనాభా దామాషా ప్రకారం అవకాశాలు కల్పించాలన్నారు. ఈసారైనా బీసీ కులగణన చేయాలన్నారు. ఉద్యమాలు, పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలుగుతామన్నారు. హనుమకొండలో ఫిబ్రవరి 2న జరిగే బీసీ రాజకీయ యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హలో ముదిరాజ్.. చలో వరంగల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు బయ్య స్వామి, ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు జోరిక సదయ్య, జనగామ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు పిట్టల శ్రీలత, నాయకులు చొప్పరి సోమయ్య, నీల రాజు, రాజకుమార్, దువ్వ నవీన్, పులి విక్రమ్, దువ్వ కనకరాజ్, పిట్టల సత్యనారాయణ, మహేందర్, బండి సతీశ్, ఉమాదేవి, అనురాధ, కిరణ్, రవి కుమార్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.


వేసవిలో నాణ్యమైన విద్యుత్

- ఇప్పటికే సమ్మర్ యాక్షన్ ప్లాన్ ఖరారు
- 29న నోడల్ ఆఫీసర్ల సమీక్ష



హన్మకొండ: వేసవిలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది. ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క విద్యుత్ సంస్థల సీఎండీలు, అధికారులతో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించారు. వేసవిలో మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో ఈ నెల 29న అన్ని సర్కిళ్లలో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఎన్పీడీసీఎల్‌లోని 16 సర్కిళ్లకు నోడల్ అధికారులుగా సీజీఎంలను నియమించారు. హనుమకొండ సర్కిల్ (జిల్లా)కు చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్‌డీ) టి.మధుసూదన్, వరంగల్ సర్కిల్ (జిల్లా)కు చీఫ్ జనరల్ మేనేజర్ రాజు చౌహాన్‌ను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. వీరు బుధవారం ట్రాన్స్‌కో, ఎన్పీడీసీఎల్ అధికారులతో సర్కిల్ కార్యాలయాల్లో సమీక్ష నిర్వహిస్తారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో చేపట్టిన పనులు, పూర్తయినవి, పురోగతిలో ఉన్న వాటిపై సమీక్షించి మిగతా పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు.

సమ్మక్క జాతరకు ఆహ్వానం


పీఓకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న పూజారులు, ఆదివాసీ సంఘాలు

కన్నాయిగూడెం : మండలంలోని ఐలాపూర్ గ్రామంలో ఫిబ్రవరి 12, 13, 14 తేదీల్లో నిర్వహించే సమ్మక్క– సారలమ్మ జాతరకు ఏటూరు నాగారం ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రాకు పూజారులు, ఆదివాసీ నాయకులు సంయుక్తంగా ఆహ్వానపత్రం అందజేశారు. పీఓను కలిసిన వారిలో పూజారుల సంఘం అధ్యక్షుడు మల్లెల రవి, పీరీల భాస్కర్, పులిశ బాలు, తిరుపతి, సురేశ్, పోడెం బాబు, ఆలం రాంబాబు తదితరులు ఉన్నారు.

సంస్కృతీసంప్రదాయాలతో బోధన ఉండాలి

- త్రిదండి చినజీయర్ స్వామి


జనగామ: దేశానికి స్వాతంత్య్రం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచినప్పటికీ మన సంస్కృతీసంప్రదాయాలు బోధించే విద్యా విధానం లేకపోవడం బాధాకరమని, ఇప్పటికైనా ఆ లోటును భర్తీ చేసి భవిష్యత్ తరాలకు మార్గదర్శకం కావాలని త్రిదండి చినజీయర్‌స్వామి కోరారు. పట్టణంలోని బాణాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆలయ ప్రధాన అర్చకుడు, యాదాద్రి దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి తండ్రి గోవిందాచార్య, గురువు త్రిపురారి రామకృష్ణ సిద్ధాంతి స్మృత్యర్థం నిర్వహించిన ఆచార్య వరివస్య కార్యక్రమంలో పాల్గొనేందుకు రెండు రోజుల పర్యటనలో భాగంగా జీయర్‌స్వామి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక రంగంలో కృష్ణమాచారి సిద్ధాంతి చేస్తున్న సేవలను అభినందించారు. పెద్దలను స్మరించడంతో పాటు సహచరులను సత్కరించి వారిని ప్రోత్సహించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం శ్రీ వరహస్వామికి స్వర్ణ కిరీటదారణ చేసి, కాలవివేకం అనే పుస్తకాన్ని జీయర్‌స్వామి ఆవిష్కరించారు. కృష్ణమాచార్య సిద్ధాంతి మాట్లాడుతూ జీయర్‌స్వామి చేతుల మీదుగా వరాహస్వామికి స్వర్ణకిరీటం సమర్పణ చేయడం సంతోషకరమన్నారు. సోమవారం జీయర్‌స్వామికి ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఆచార్యులు ఆకెళ్ల జయకృష్ణ, శ్రీనివాసాదిత్య, ఫణివరకుమార్, బట్టర్ సుందర ప్రహ్లాదచారి, తిరువెంగలాచారి, నరసింహరామ, గౌరీబట్ల సీతారామ సిద్ధాంతి, బ్రహ్మబట్ల శ్రీనాథ్, శ్రీనివాసాచార్య, గౌరిబట్ల సుబ్రహ్మణ్య శర్మ, ఓరుగంటి మనోహరాశర్మ, యోగేశ్వర, అమర వాది లక్ష్మణాచార్యులు, మరింగంటి రాఘవాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.


అతిథులకు సత్కారం చేస్తున్న జీయర్ స్వామి

క్రమబద్ధీకరించాకే నియామకాలు చేపట్టాలి

- కాంట్రాక్టు అధ్యాపక కోఆర్డినేషన్ కమిటీ డిమాండ్

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాకే రెగ్యులర్ అధ్యాపకుల నియామకాలు చేపట్టాలని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల కోఆర్డినేషన్ కమిటీ బాధ్యులు డాక్టర్ సాధురాజేశ్, డాక్టర్ బి. సతీశ్ డిమాండ్ చేశారు. సోమవారం కేయూలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాల వద్ద నిర్వహించిన సమావేశం(గేట్‌మీటింగ్) వారు మాట్లాడారు. ఈనెల 26న హైదరాబాద్‌లోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలను బలోపేతం చేసేందుకు ఖాళీ అధ్యాపకుల పోస్టులను భర్తీచేస్తామని ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. అయితే కొన్నేళ్లుగా యూనివర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్నవారికి న్యాయం చేయాలన్నారు. అందుకు అన్ని విద్యార్హతలు కలిగి ఉన్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం యూనివర్సిటీలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. సమావేశంలో కమిటీ బాధ్యులు డాక్టర్ సత్యజాల, డాక్టర్ సీహెచ్ నాగేశ్వర్‌రావు, డాక్టర్ రఘువర్ధన్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సూర్యనారాయణ,డాక్టర్ సతీశ్, డాక్టర్ బి. వెంకటగోపీనాథ్, రంజిత్, తూర్పాటి వెంకటేశ్, డాక్టర్ వీణ, వాణిశ్రీ, దీప్తి, స్వప్న, సాహితీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజేశ్ తదితరులు

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

- తొడేళ్లగూడెంలో ఘటన
- తన మృతికి ముగ్గురు కారణమంటూ సెల్ఫీ వీడియో


సతీశ్(ఫైల్)

డోర్నకల్: ఓవ్యక్తితో గొడవల తోపాటు పోలీసు కేసు నమోదు కావడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన డోర్నకల్ మండలం తొడేళ్లగూడెంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పగడాల సతీశ్(30) ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామస్తుడు సుంకరి వెంకన్న, సతీశ్ మధ్య గొడవల జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వెంకన్న కౌలుకు తీసుకున్న భూమి నుంచి ఈ నెల 21 సతీశ్ వెన్నారం వాగు నుంచి ఇసుక తరలించాడు. దీంతో వెంకన్న ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకున్నాడు. మరుసటి రోజు సతీశ్ తన ఇంటి సమీపంలో వెంకన్న ఇంటికి వెళ్లే రోడ్డుపై కంప అడ్డుగా పెట్టాడు. దీనిపై వెంకన్న ఫిర్యాదు మేరకు పోలీసులు సతీశ్‌పై ఈ నెల 24న కేసు నమోదు చేశారు. దీంతో వెంకన్నతో గొడవలు, పోలీస్ కేసు నమోదు కావడంతో మనస్తాపం చెందిన సతీశ్ ఆదివారం ముల్కలపల్లిలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అటువైపు వెళ్తున్న వారు చూసి కుటుంబీకులకు సమాచారం ఇవ్వగా సతీశ్‌ను ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు.

నా చావుకు ఆ ముగ్గురే కారణం..

తన చావుకు సుంకరి వెంకన్న, ఆయన కుమారులు చరణ్, పవన్ కారణమని పురుగుల మందు తాగడానికి ముందు సతీశ్ సెల్ఫీ వీడియో ద్వారా తెలిపాడు. ఇసుక రవాణాతో పాటు ఇతర కారణాలతో తనను ఇబ్బందులకు గురి చేశారన్నారు. తన చావుకు కారకులైన వారిపై చర్య తీసుకోవాలని కోరాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి జగన్నాథం ఫిర్యాదు మేరకు సీఐ రాజేశ్ సోమవారం విచారణ చేపట్టారు.

హత్యాయత్నం.. రోడ్డు ప్రమాదంగా

కేసు నీరుగార్చేందుకు కుట్ర..

- ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం నిర్వాకం
- నిందితులతో కుమ్మక్కయ్యారని ఆరోపణ
- న్యాయం చేయాలని బాధితుడి వేడుకోలు

హన్మకొండ చౌరస్తా: శత్రువుల దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రికి వచ్చిన బాధితుడికి వైద్యులు చికిత్స అందిస్తే.. రికార్డుల్లో మాత్రం రోడ్డు ప్రమాదంగా నమోదు చేసి కేసును నీరుగార్చే కుట్రకు పూనుకుంది ఓ ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం. తనకు జరిగిన అన్యాయంపై న్యాయస్థానంలో పోరాడుతున్న సదరు యువకుడు ఆస్పత్రి యాజమాన్యం ఇచ్చిన మెడికల్ రికార్డులను చూసి ఆందోళనకు గురయ్యాడు. యాజమాన్యాన్ని ప్రశ్నించగా బెదిరింపులే దిక్కయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా వంగపహాడ్‌కు చెందిన శ్యాంరావు ప్రశాంత్‌కుమార్ 2022, జనవరి 20వ తేదీ రాత్రి 9 గంటలకు తన ఇంటి వద్ద ఉండగా కొందరు కత్తులు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. తీవ్ర గాయాలతో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రికి(ఇటీవల పేరు మార్చారు) తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి అత్యవసర చికిత్స అందించారు. తలపై 22కు పైగా కుట్లు వేయడంతో పాటు చేతి వేలు విరిగిపోగా సర్జరీ చేసి రాడ్డు వేశారు. మూడు రోజుల చికిత్స అనంతరం 24వ తేదీన ప్రశాంత్‌కుమార్‌ను డిశ్చార్జ్ చేశారు. మెరుగైన వైద్య కోసం అహ్మదాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో కొద్ది రోజులు చికిత్స పొంది కోలుకుని ఇంటికి చేరుకున్నాడు.

ఆస్పత్రి మాయాజాలం


బాధితుడు శ్యాంరావు ప్రశాంత్‌కుమార్

ప్రైవేట్ ఆస్పత్రిలో న్యూరో, ఆర్థో సర్జన్‌లు శస్త్ర చికిత్స చేసి వైద్యం అందించారు. ఆ సమయంలో ప్రశాంత్‌కుమార్ తనపై పది మంది దాడి చేశారని వారి పేర్లతో సహా తెలియజేశాడు. అతడి తండ్రి రఘు ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదు చేయడంతో పాటు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మూడేళ్ల తర్వాత కేసు తాజాగా తుది దశకు చేరుకుంది. ఈ సమయంలో కీలకమైన మెడికల్ రిపోర్టును చికిత్స అందించిన సదరు ఆస్పత్రి యాజమాన్యం హత్యాయత్నం కాదు రోడ్డు ప్రమాదంలో గాయపడి వచ్చిన ప్రశాంత్‌కుమార్ చికిత్స అందించినట్లు చిత్రీకరించింది. విషయం తెలుసుకున్న ప్రశాంత్‌కుమార్ తనకు జరిగిన అన్యాయంపై ఆస్పత్రి యాజమాన్యాన్ని ప్రశ్నించడంతో ముందు రాజీ కుదుర్చుకుందామన్నారు. వినకపోవడంతో బెదిరిస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులతో చేతులు కలిపి శిక్ష నుంచి తప్పించుకునేందుకు సహకరిస్తున్నారని ప్రశాంత్‌కుమార్ వాపోయాడు. ఈ విషయంపై డీఎంహెచ్‌ఓ అప్పయ్యకు ఫిర్యాదు చేశానని, నిందితులకు సహకరించిన ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంతో పాటు తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు. ఈ విషయమై ఆ ప్రైవేట్ ఆస్పత్రి చైర్మన్, ఆర్‌ఎంఓలను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు.